
సాక్షి
హనుమకొండ

బుధవారం | 31 | మే | 2023



రెగ్యులరైజ్ చేయాలి

యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. - 8లో▸



అడవుల్లో స్మారక శిలలు

ములుగు జిల్లా దామెరవాయి అడవుల్లో పాతరాతి యుగం నాటి స్మారక శిలలు ఉన్నట్లు గుర్తించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$41^0/28^0$

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమైనా మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రలు నమోదవుతాయి. రాత్రి సమయంలో ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి హరీశ్‌రావు రాక



హన్మకొండ: రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు బుధవారం హనుమకొండ పర్యటనకు వస్తున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, కార్మికయుద్ధభేరి సభలో పాల్గొంటారు. ఈ మేరకు షెడ్యూల్ విడుదలైంది. ఉదయం 11.30 గంటలకు సిద్దిపేట నుంచి రోడ్డు మార్గానా బయలుదేరి మధ్యాహ్నం 12.45 గంటలకు హనుమకొండకు చేరుకుంటారు. హంటర్ రోడ్డులోని ఫాథర్ కొలంబో మెడికల్ కళాశాలను ప్రారంభిస్తారు. మధ్యాహ్న భోజన విరామ సమయం అనంతరం 3.30 గంటలకు హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రేడియాలజీ ల్యాబ్‌ను ప్రారంభిస్తారు. సాయంత్రం 4.15 గంటలకు కాకతీయ వైద్య కళాశాల అకడమిక్ బ్లాక్‌లో జరిగే డాక్టర్ల సమావేశంలో పాల్గొంటారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు పరిశీలించి సమీక్షిస్తారు. 5.15 గంటలకు హనుమకొండ బాలసముద్రంలోని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. 6 గంటలకు హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం ఆవరణలో జరిగే కార్మిక యుద్ధభేరి సభలో పాల్గొని ప్రసంగిస్తారు. రాత్రి 7.30 గంటలకు ఇక్కడి నుంచి సిద్దిపేటకు బయలుదేరుతారు.

ఎంసెట్ అడ్మిషన్ షెడ్యూల్ విడుదల

న్యూశాయంపేట : టీఎస్ ఎంసెట్–2023 అడ్మిషన్ల కోసం షెడ్యూల్ విడుదలైందని, ఈ విషయాన్ని టెమ్రిస్ విద్యార్థులు గమనించాలని తెలంగాణ మైనారిటీ గురుకులాల విద్యాసంస్థ (టెమ్రిస్) ఆర్‌ఎల్‌సీ–1 ఎ.శ్రీపాల ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసెట్‌లో క్వాలిఫై అయిన విద్యార్థులు అడ్మిషన్ కోసం సంబంధిత సర్టిఫికెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. మొదటి దఫా ప్రక్రియ వచ్చేనెల 26 నుంచి, రెండో దఫా ప్రక్రియ జూలై 27 నుంచి ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

రైల్వే సేఫ్టీ కమిషనర్ పర్యటన వాయిదా

కాజీపేట రూరల్: కాజీపేట సబ్‌డివిజన్ పరిధిలోని చింతల్‌పల్లి–నెక్కొండ రైల్వే మూడో లైన్ తనిఖీ నిమిత్తం మంగళవారం రానున్న దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ కమిషనర్ (సీఆర్ఎస్) పర్యటన అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు రైల్వే అధికారులు తెలిపారు. తిరిగి పర్యటన షెడ్యూల్ త్వరలో ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

హన్మకొండ: ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలతోపాటు సమస్యలు తెలుసుకుని మెరుగైన సేవలు అందించేందుకు బుధవారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీఎస్ ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్‌రావు తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, ప్రయాణికులు 9959226047, 7382853941 నంబర్లలో సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి

కరీమాబాద్: ఓటు హక్కు కోసం ఈ ఏడాది అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులతోపాటు అర్హులందరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ షెడ్యూల్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి



ఖిలా వరంగల్: నకిలీ విత్తనాల బెడదను అరికట్టి నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించాలని తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) రాష్ట్ర కార్యదర్శి వీరగాని శంకరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వడగళ్ల వర్షానికి మొక్కజొన్న, వరి పంటలు, ఇతర కూరగాయల తోటలు పూర్తిగా ధ్వంసమయ్యాయని తెలిపారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జోసఫ్, ఎం.ఏ.పాషా, ప్రభాకర్‌రెడ్డి, కందిక పుష్ప, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కదిలేదిలేదు..

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారుల లాంగ్ స్టాండింగ్..
- బదిలీల ప్రతిపాదన నివేదిక సిద్ధం..
- పావులు కదిపిన నాయకులు ..?

కాజీపేట అర్బన్: రిజిస్ట్రేషన్ శాఖ పరిధి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గ్రేడ్–1, 2 సబ్ రిజిస్ట్రార్లు ఏళ్ల తరబడిగా ఒకే దగ్గర విధులు నిర్వహిస్తూ 'కదిలేదిలె'.. అన్నట్టు పాతుకుపోయారు. సాధారణంగా ప్రభుత్వం ఉద్యోగులను ప్రతి మూడేళ్లకు ఒకసారి బదిలీ చేయాలి. ఈ శాఖలో ఇందుకు భిన్నంగా నాలుగేళ్ల నుంచి 13 ఏళ్ల వరకు ఒకే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఐజీలతోకూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి నివేదిక రూపొందించారు. ఉమ్మడి వరంగల్ పరిధిలో చాలా ఏళ్లుగా ఒకే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్లకు ఈ సారైనా స్థాన చలనం కలిగేనా అనే చర్చ జరుగుతోంది.

పావులు కదిపిన నాయకులు

రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఐజీలతో కూడిన ప్రత్యేక కమిటీ లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న గ్రేడ్–1, 2 సబ్ రిజిస్ట్రార్ల బదిలీకి రంగం సిద్ధం చేశారు. ఆ నివేదికను ప్రభుత్వానికి సైతం అందజేసినట్లు సమాచారం. కాగా ఉద్యోగ సంఘాల నాయకులు పావులు కదిపి ఇప్పుడు బది లీలు చేపడితే రాబోవు ఎన్నికల్లో మీకే ఇబ్బందని, ఎన్నికల తర్వాత చేపట్టాలని ప్రభుత్వ నాయకులకు చెప్పడంతో బదిలీలకు బ్రేక్ పడినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

జోన్–4లో భాగంగా..

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన సబ్ రిజిస్ట్రార్లు జోన్–4లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు గ్రేడ్–2 సబ్ రిజిస్ట్రార్లు, మల్టీ జోన్ డిసిప్లినరీ క్రింద గ్రేడ్–2 సబ్‌రిజిస్ట్రార్లు భద్రాద్రి కొత్తగూడెంతో పాటు వివిధ జోన్‌లకు బదిలీ అయ్యే అవకాశం ఉంది. కాగా తమకు రాబడి వచ్చే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు బదిలీ అయ్యే విధంగా లేదా రీపోస్టింగ్ తెచ్చుకునేలా పావులు కదుపుతున్నట్లు తెలిసింది.

డాక్యుమెంట్ రైటర్ల హవా..

సబ్ రిజిస్ట్రార్లు కొంత మంది డాక్యుమెంట్ రైటర్లను ఏర్పాటు చేసుకుని వ్యవహారం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. వారే ఏజెంట్లుగా అన్నీ నడిపిస్తున్నారు.



వరంగల్ ఆర్వో కార్యాలయం

అన్ని ఉన్నా కొర్రీలు..

ఒకే కార్యాలయంలో ఏళ్ల తరబడి ఉండడంతో తమ పరిధిలోని భూ స్వరూపాన్ని పసిగట్టేస్తున్నారు. అన్ని పత్రాలు సరిగా ఉన్నా కొర్రీలు పెడుతూ అందినకాడికి దండుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్‌లోని కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రభుత్వ భూములను, రహదారులను డబుల్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. కొందరు సబ్ రిజిస్ట్రార్లు ఏకంగా తమ పరిధిలోని సర్వేనంబర్లపై పట్టు సాధించి అవైతే చేయలేమంటూ.. మెలిక పెడుతుండడంతో భూమి అమ్ముకునే వారు ముడుపులు ముట్టచెప్పక తప్పడంలేదని పలువురు బాధితులు తెలిపారు.

సాధారణ వ్యక్తులు రిజిస్ట్రేషన్ నిమిత్తం కార్యాలయాలకు వస్తే తాము ఏజెంట్‌గా ఏర్పాటు చేసుకున్న డాక్యుమెంట్ రైటర్ల వద్దకు వెళ్లమని ఉచిత సలహా ఇస్తున్నారు. దీంతో సదరు రైటర్ చెప్పిందే వేదంగా చదివింపులు చెల్లించాల్సి వస్తున్నది. దీంతో వారి హవా కొనసాగుతోంది.

ఉమ్మడి వరంగల్‌లో సబ్ రిజిస్ట్రార్ల లాంగ్ స్టాండింగ్ ఇలా..

గ్రేడ్–1 సబ్ రిజిస్ట్రార్లు..
ములుగు – 13 ఏళ్లు
వరంగల్ రూరల్– 6 ఏళ్లు
వరంగల్ ఆర్వో–4 ఏళ్లు
డీఐజీ కార్యాలయం
సూపరింటెండెంట్–4 ఏళ్లు

గ్రేడ్–2 సబ్ రిజిస్ట్రార్లు..
వరంగల్ ఫోర్ట్–8 ఏళ్లు
నర్సంపేట–8 ఏళ్లు
జనగామ–9 ఏళ్లు

కేసీఆర్ కార్మిక పక్షపాతి

- కార్మిక హక్కులు కాలరాస్తున్న కేంద్రం
- చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: సీఎం కేసీఆర్ కార్మిక పక్షపాతి.. కార్మిక సంఘాలను కార్మిక సహకార సంఘాలుగా బలోపేతం చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ చెప్పారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందుకు ఇదే ఆవరణలో జరిగే కార్మిక యుద్ధభేరి సభావేదిక ఏర్పాట్లను పరిశీలించి బెలూన్ ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుంటే సీఎం కేసీఆర్ సంఘటిత, అసంఘటిత కార్మికులకు ఎన్నో రకాల కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఏటా మే నెలలో నిర్వహించే కార్మిక చైతన్య మాసోత్సవాల్లో గుర్తించిన సమస్యలు, తీసుకున్న నిర్ణయాలు సీఎంకు వివరిస్తే రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కార్మిక సంక్షేమ భవనాలకు స్థలం కేటాయించారని పేర్కొన్నారు. అలాగే ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేయించామన్నారు. కార్మికుల్లో ఉల్లాసాన్ని కలిగించేందుకు క్రీడా పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తాను కార్మికులకు బీమా సౌకర్యం కల్పించి గుర్తింపు కార్డులు ఇప్పించగా.. 6,914 మంది కార్మికులకు రూ.45.75 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఈ నెల 31న జరిగే కార్మిక యుద్ధభేరి సభకు సంఘటిత, అసంఘటిత కార్మికులతో పాటు అన్ని వర్గాల కార్మికులు హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సమావేశంలో టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.జాన్సన్, కార్మిక మాసోత్సవాల కోఆర్డినేటర్ పుల్ల శ్రీనివాస్, నాయకులు రాజు, రాంప్రసాద్, సాంబయ్య, బత్తిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

'టు-డే' క్రికెట్ లీగ్‌కు వరంగల్ జట్టు ఎంపిక

వరంగల్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 6 నుంచి ఆగస్టు 18వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే 'టూ డే' లీగ్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ జట్టును ఎంపిక చేసినట్లు వరంగల్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో జిల్లా సెలక్షన్ కమిటీ బండారు ప్రభాకర్, తోట రాము, మెతుకు కుమార్ ఆధ్వర్యంలో బౌలింగ్, బ్యాటింగ్‌లో మెరుగైన ప్రతిభ చూపించిన 36 మందితో కూడిన ప్రాపబుల్స్ జట్టును ఎంపిక చేశామన్నారు. జట్టులో కె.రోహిత్‌రెడ్డి, ఎ.గణేష్, హెచ్.పవన్, వితేష్, వరుణ్, ఎం.దేవేందర్, అనురుధ్, ఎం.విశ్వతేజ, జి.సాయికుమార్, డి.సతీష్‌కుమార్, ఎం.రామ్‌చరణ్, జె.నిఖిల్, డి.శివప్రసాద్, ఎ.రాజ్‌కుమార్, ఆదర్శ్, డి.కుమార్, ఎ.లక్ష్మణ్, జె.శరత్‌వర్మ, జె.లక్ష్మణ్‌కుమార్, శరత్‌వర్మ, వ్రశాంక్, ఎస్.రాహుల్, ఎం.ప్రణీత్, సీహెచ్.వరుణేశ్వర్, బి.వైష్ణవ్, టి.త్రిశూల్, ప్రణయ్‌కుమార్, ఎస్.సాయినవనీత్, రంగారావు, ఎ.చంద్ర, పి.జాకబ్, జి.అఖిల్, మనిదీప్, రాంప్రసాద్, సిద్ధార్థ, దనేల్, పి.రుత్విక్ ఉన్నట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎంపికైన జట్టు బుధవారం నుంచి జిల్లా కోచ్ గోవింద్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యే శిక్షణ శిబిరంలో ప్రాక్టీస్ చేస్తుందని ఆయన తెలిపారు.



క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపికైన వరంగల్ ప్రాబబుల్స్ జట్టు

'ఐనవోలు' ఆదాయం రూ.29.77 లక్షలు

ఐనవోలు : ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి ఆలయానికి రూ.29.77 లక్షల ఆదాయం సమకూరింది. ఆలయంలోని హుండీలను దేవాదాయ శాఖ పరిశీలకుడు జి.సంజీవరెడ్డి పర్యవేక్షణలో మంగళవారం లెక్కించారు. మార్చి 28 నుంచి మే 30వ తేదీ వరకు హుండీల్లో రూ.7.58 లక్షల నగదు, వివిధ టికెట్ల విక్రయాల ద్వారా రూ.22.18 లక్షలు సమకూరినట్టు కార్యనిర్వహణాధికారి (ఈఓ) అద్దంకి నాగేశ్వర్‌రావు ప్రకటించారు. హుండీల్లో లభ్యమైన వెండి, బంగారాన్ని యథావిధిగా హుండీలోనే వేసి సీల్ చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మజ్జిగ జైపాల్, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, మహబూబాబాద్‌కు చెందిన శ్రీలక్ష్మి వేంకటేశ్వర సేవా సమితి సభ్యులు, కానిస్టేబుల్ కిషోర్, ఆలయ అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

పట్టణ ప్రగతి వేడుకలు వైభవంగా నిర్వహించాలి

వరంగల్ అర్బన్: పట్టణ ప్రగతి వేడుకలు వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ సత్యనారాయణ సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. బల్దియా ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. సత్యనారాయణ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 16న పట్టణ ప్రగతి కార్యక్రమం, కార్పొరేషన్ కార్యాలయాల్లో జాతీయ పతాక ఆవిష్కరణకు ఏర్పాట్లు చేయాలన్నారు. పట్టణ ప్రగతి, ఇతర పథకాల కింద మంజూరైన నిధులు, చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధి, పట్టణంలో కల్పించిన మౌలిక వసతులను వివరిస్తూ ఫ్లెక్సీలు ప్రదర్శించాలన్నారు.

శాయంపేట మండలం నేరేడుపల్లిలో నీటిలో తడిసిన ధాన్యం ఎత్తుతున్న కుటుంబ సభ్యులు



అకాల వర్షం..

- సగటు వర్షపాతం 27.7 మి.మీ
- కల్లాల్లోనే ధాన్యం.. రైతుల దైన్యం
- తొందరపడి విత్తనాలు వేయొద్దు

హన్మకొండ: జిల్లా వ్యాప్తంగా మంగళవారం వేకువజామున కురిసిన అకాల వర్షం అన్నదాతను మరోసారి ఆగం చేసింది. యాసంగి ధాన్యం కొనుగోళ్ల వేగం అందుకోక పోవడంతో కల్లాలు, కేంద్రాల్లోని ధాన్యం తడిసి పోయింది. లారీల కొరతతో కొనుగోళ్లు మందగించడంతో పలు ప్రాంతాల్లో రైతులు తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళనకు దిగారు.

27.7 మి.మీటర్ల సగటు వర్షపాతం

జిల్లాలోని ధర్మాసాగర్, వేలేరు, ఎల్కతుర్తి మినహా మిగతా మండలాల్లో తెలికపాటి నుంచి భారీ వర్షం కురిసింది. సగటు వర్షపాతం 27.7 మిల్లీ మీటర్లు నమోదైంది.అత్యధికంగా శాయంపేటలో 50.2 మి.మీ కురవగా.. హనుమకొండ 48, కమలాపూర్ 46.6, పరకాల 45.6, నడికుడ 43.6, ఐనవోలు 33, కాజీపేట 30, ఆత్మకూరు 22.8, భీమదేవరపల్లి 9.2, హసన్‌పర్తి 41.9, దామెర 16.5, ఎల్కతుర్తిలో 0.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

తొందరపడి విత్తనాలు వేయొద్దు..

రోహిణీ కార్తెతో వాన కాలం పంటల సాగుపనులు రైతులు మొదలు పెడుతారు. రోహిణి కార్తె ప్రవేశించిన అయిదు రోజులకు మంగళవారం వర్షం కురిసింది. దీంతో ఇప్పటికే దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు కొందరు సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే తొందరపడి ఇప్పుడే విత్తనాలు వేయొద్దని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. మరో రెండు వర్షాలు కురిస్తే నెలలోని వేడి తగ్గుతుందని, నేల పూర్తిగా తడిసిన తర్వాతనే విత్తనాలు వేసుకోవాలని చెబుతున్నారు. తొందరపడి విత్తనాలు వేస్తే మొలకెత్తక నష్టపోయే అవకాశముంటుందని పేర్కొంటున్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి..

అకాల వర్షానికి కల్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం, మొక్కజొన్న తడిసి పోయింది. సాకులు చూపకుండా ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కమలాపూర్, పరకాల తదితర ప్రాంతాల్లో రైతులు ఆందోళనకు దిగారు. ప్రధాన రహదారులపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. గన్నీ సంచులు, హమాలీలు, ట్రాన్స్‌పోర్ట్ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



కమలాపూర్‌లో ధర్నా చేస్తున్న రైతులు

హక్కుల సాధనకు రాజీలేని పోరాటం

కేయూ క్యాంపస్: కార్మికుల హక్కులు, కనీస వేతనాలు, పనిభద్రత కోసం సీఐటీయూ రాజీలేని పోరాటాలు చేస్తున్నదని ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మెట్టు రవి అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద యూనియన్ కేయూ ప్రధాన కార్యదర్శి దేశిని రవికుమార్ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెట్టు రవి మాట్లాడారు. రాబోయే కాలంలో కార్మిక వర్గ, దేశ సమైక్యత కోసం సీఐటీయూ అహర్నిశలు కృషి చేస్తుందని చెప్పారు. గడిచిన ఐదు సంవత్సరాలుగా కాకతీయ యూనివర్సిటీలో తాత్కాలిక ఉద్యోగులకు వేతనాలు పెంచక పోవటం బాధకరమని అన్నారు. ఇప్పటికైనా వైస్‌చాన్స్‌లర్ స్పందించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి, కేయూ కమిటీ బాధ్యులు సంఘాల రాజు, ఎం.రాజేందర్, మధు, శోభ, కృష్ణ, శ్రీనివాస్, సీహెచ్ రమేష్, సందీప్, నయీమ్, ప్రభాకర్, గాజ రాజు, పల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న యూనియన్ బాధ్యులు, కార్యకర్తలు

బల్దియా.. నిధుల దుబారా!

సంప్రదాయ వెలుగులకు స్వస్తి

- మరమ్మతు లేక వృథాగా సోలార్ సిస్టమ్
- కార్యరూపం దాల్చని స్మార్ట్‌సిటీ 'సౌర విద్యుత్'
- చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి ఉత్తదే..!
- పట్టించుకోని పాలక, అధికార వర్గాలు

వరంగల్ అర్బన్: ఇంధన వనరుల వినియోగాన్ని తగ్గించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలతోపాటు ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో భాగంగా బయోగ్యాస్ విద్యుత్ ప్లాంట్లు, సౌర నగరాలు, పట్టణాలుగా తీర్చిదిద్దుకోవాలని స్పష్టమైన మార్గదర్శకాలున్నాయి. ఈ నేపథ్యంలో పల్లెల్లో సాధారణ ప్రజల నుంచి మొదలు కార్పొరేట్ సంస్థలు, విద్యుత్, సింగరేణి వంటి లిమిటెడ్ కంపెనీలు సౌర శక్తిపై దృష్టి సారిస్తున్నాయి. అయితే ఏటా రూ.7.50కోట్ల విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్న గ్రేటర్ వరంగల్ మాత్రం సంప్రదాయ వెలుగులకు స్వస్తి పలికింది. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బయో గ్యాస్ విద్యుత్ ప్లాంట్లు మూలన పడ్డాయి. సోలార్ ప్రాజెక్టర్ ఎందుకూ పనికి రాకుండా పోయింది. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన ప్లాంట్లు ప్రదర్శనకే పరిమితమయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపు లేనితనానికి ఇవే నిదర్శనం.

సన్నగిల్లిన సోలార్ సిస్టమ్

- బల్దియా ఆధ్వర్యంలో మొదటి విడతలో 2014–15 సంవత్సరం 27 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ సిస్టం ఏర్పాటు చేశారు. ఇందుకు రూ.49లక్షలు వెచ్చించారు. వీటి ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను బల్దియా ప్రధాన కార్యాలయానికి వినియోగించగా కరెంటు బిల్లులు కొంత మేర తగ్గాయి. అయితే ఏడాదిన్నరకే సోలార్ వెలుగులు నిలిచిపోయాయి. మరమ్మతు చేయించక అసలే పనికి రాకుండా పోయాయి.
- రెండో విడతలో రూ.1.68కోట్ల అంచనాతో 70కిలోవాట్ల సోలార్ సిస్టం ప్రతిపాదనలకు సంబంధించి ఊసే లేకుండా పోయింది.
- స్మార్ట్‌సిటీలో భాగంగా హన్మకొండ చింతగట్టు క్యాంపు కార్యాలయం నుంచి కాకతీయ కెనాల్ మీదుగా మొగిళిచర్ల వరకు 25కిలోమీటర్ల దూరం సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసి రోజుకు 14 మెగావాట్ల విద్యుత్ తయారు చేయాలని 2017 సంవత్సరంలో నిర్ణయించారు. ఇందుకు 90 ఎకరాల పొడవు స్థలాన్ని సర్వే చేశారు. గుజరాత్ తరహాలో సోలార్ వెలుగుల కోసం కాకతీయ కెనాల్‌పై ప్యానళ్లు ఏర్పాటు చేసేందుకు రూ.15.20కోట్లతో డీపీఆర్‌లు రూపొందించారు. అప్పటి నగర మేయర్ నరేందర్, కలెక్టర్ అమ్రపాలి, కమిషనర్ శృతి ఓజాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అయినా స్మార్ట్‌సిటీ సోలార్ డీపీఆర్ పట్టాలెక్కలేదు. స్మార్ట్ ప్రాజెక్టుల్లో నుంచి సోలార్ ప్రతిపాదనలను రద్దు చేసి ఇతర ప్రాజెక్టులను తీసుకున్నారు. బల్దియాకు ప్రతి ఏడాది పెద్ద మొత్తంలో విద్యుత్ వినియోగానికి నిధులు వెచ్చిస్తోంది. సోలార్ పవర్ ప్లాంట్లకు పెట్టిన ఖర్చును విద్యుత్ ఉత్పత్తి ద్వారా రాబట్టుకునేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నా పాలక, అధికార వర్గాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



హనుమకొండ బాలసముద్రంలో వృథాగా ఉన్న బయోగ్యాస్ విద్యుత్ ప్లాంట్



బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో పనిచేయని బయోగ్యాస్ విద్యుత్ ప్లాంట్



గ్రేటర్ ప్రధాన కార్యాలయం వద్ద రిపేరు చేయక నిరుపయోగంగా మారిన సోలార్ సిస్టమ్

బయోగ్యాస్ వెలుగులేవి?

- హన్మకొండ బాలసముద్రంలోని కమిషనర్ క్యాంపు కార్యాలయానికి సమీప నర్సరీ కేంద్రంలో 2012 సంవత్సరం రూ.13లక్షల వ్యయంతో 12 కిలోవాట్ల(కేడబ్ల్యూ) బయోగ్యాస్ విద్యుత్ ఆధారిత ప్లాంట్ ఏర్పాటు చేశారు. రోజుకు 20 టన్నుల కూరగాయల వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా నెలకు రూ.10వేల కరెంటు బిల్లు ఆదా అయింది. అయితే ఏడాదికే ప్లాంట్ మూలకు చేరింది.
- బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో 2014 సంవత్సరం రూ.20లక్షల నిధులతో 24 కిలోవాట్ల బయోగ్యాస్ విద్యుత్ ప్లాంట్ నిర్మించారు. దీనిద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను బల్దియా ప్రధాన కార్యాలయానికి ఉపయోగించాలని నిర్ణయించారు. ఆరు నెలలు కూడా నడిపించలేక చేతులేత్తేశారు.
- రాంపూర్ డంపింగ్ యార్డులో 2012–13 సంవత్సరం సుమారు రూ.30లక్షలతో బయోగ్యాస్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు షెడ్లు నిర్మించారు. అవి చెత్త గుట్టల్లో కలిసి పోయాయి.

క్లుప్తంగా

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

వరంగల్ క్రైం : సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ డాక్టర్ జితేందర్‌రెడ్డి తెలిపారు. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిరుమల జంక్షన్ సమీపంలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని సమాచారంతో తనిఖీ చేశామన్నారు. అక్కడ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న గోపాల్‌పూర్‌కు చెందిన గట్ల రాజేష్, భీమారానికి చెందిన కొండిరెడ్డి శ్రీధర్‌రెడ్డిలను అరెస్టు చేసి, వారి నుంచి రూ.65,080 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నిందితులను సుబేదారి పోలీసులకు అప్పగించినట్లు ఆయన వెల్లడించారు. టాస్క్‌ఫోర్స్ దాడిలో ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాస్‌రావు, జనార్దన్‌రెడ్డి, ఎస్సైలు శరత్, లవన్‌కుమార్ పాల్గొన్నారు.

'తుంటియా' రాష్ట్ర జనరల్ సెక్రటరీగా తిరుపతి


తిరుపతి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ


యాదగిరి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

కేయూ క్యాంపస్: తెలంగాణ యూనివర్సిటీస్ నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ యూనియన్(తుంటి యా) రాష్ట్ర జనరల్ సెక్రటరీగా కేయూ ఎన్‌జీఓ జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి ఎన్నికయ్యారు. ఇంకా కేయూ నుంచి పలువురికి రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కింది. ఈనెల 29న హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీలో జరిగిన యూనియన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బి.జ్ఞానేశ్వర్(ఓయూ), సెక్రటరీ జనరల్ ఎస్.అమృతరెడ్డి(వ్యవసాయ విశ్వవిద్యాలయం), జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి (కేయూ), గౌరవ అధ్యక్షుడిగా మహేష్‌గౌడ్ (డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ) ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గంలో కేయూకు చెందిన వారిలో.. వర్కింగ్ ప్రెసిడెంట్ కేయూ ఎన్‌జీఓ అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు అబ్దుల్‌షుకూర్, కార్యదర్శులు మహ్మద్ యూనస్, కొమురయ్య, మహిళా కార్యదర్శి అరుణకుమారి, కార్యవర్గ సభ్యుడు పి.అంకూస్ ఉన్నట్లు సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ తిరుపతి మంగళవారం కేయూలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న రెగ్యులర్, టైంస్కేల్, తాత్కాలిక, ఒప్పంద ఉద్యోగులందరినీ కలుపుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

చైన్ స్నాచర్ల హల్‌చల్

జనగామ: జనగామలో మంగళవారం ఓ మహిళ ఇంటి ముందు ముగ్గువేస్తుండగా చైన్‌స్నాచర్లు మెడలోని మంగళసూత్రం లాక్కునే ప్రయత్నం చేయగా ఆమె ప్రతిఘటించింది. ఈఘటనలో ఆమెకు గాయాలయ్యాయి.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

ప్రముఖ సామాజిక వేత్త ప్రొఫెసర్ జి.హరగోపాల్

- కుక్టా జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సదస్సు


సదస్సులో అభివాదం చేస్తున్న వివిధ వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపక సంఘాల జేఏసీ బాధ్యులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి.. ఇందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి కృషిచేయాలని ప్రముఖ సామాజిక వేత్త, హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. తెలంగాణ వర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో 'చలో కాకతీయ' పేరిట కుక్టా(కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్) జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన అన్ని వర్సిటీల రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన ఆన్‌లైన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ వ్యవస్థల వైఫల్యాలే వర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపక వ్యవస్థకు మూల కారణమని, ఏళ్లతరబడి పనిచేస్తున్నా రెగ్యులరైజ్ చేయకపోవటం ప్రభుత్వ వ్యవస్థ వైఫల్యమేనన్నారు. ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తూ సెంట్రల్ వర్సిటీల మాదిరిగా రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ చేసి ఉంటే కాంట్రాక్టు అధ్యాపకుల వ్యవస్థ ఇంతలా పెరిగేది కాదని అభిప్రాయపడ్డారు. ఇటీవల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకలను రెగ్యులరైజ్ చేసినట్లుగా వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులనూ చేయాలన్నారు. వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, సమస్యపై తొలుత ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇవ్వడంతోపాటు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. వర్సిటీల వీసీల ద్వారా కూడా ప్రభుత్వాన్ని కోరేలా కార్యచరణ చేపట్టాలని పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ఆచార్య టి.పాపిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాధనలో వర్సిటీల అధ్యాపకుల పాత్ర ఎంతో కీలకమైనదని, రాష్ట్ర ప్రభుత్వం కొంతమేర గౌరవ ప్రదమైన వేతనాలు ఇస్తున్నదని అయితే.. ఉద్యోగ భద్రతను కోరుకుంటున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపాలని కోరారు.

కుక్టా జేఏసీ చైర్మన్ డాక్టర్ పి.కరుణాకర్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల మాదిరిగానే యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులకు రెగ్యులరైజ్ చేయాలని గతంలో హనుమకొండకు సీఎం కేసీఆర్ వచ్చినప్పుడు విన్నవించగా.. వీరిని కూడా రెగ్యులరైజ్‌చేసే అంశం పరిశీలించాలని ఆదేశించినా సంబంధిత అధికారులు పట్టించుకోవటంలేదన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేస్తున్నట్లుగా ప్రకటించాలని సీఎంను ఈ సదస్సు ద్వారా డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘాల ప్రతినిధులు డాక్టర్ ఎ.పరశురామ్, డాక్టర్ బి.ధర్మతేజ, డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ భూమయ్య, శ్యామ్, యశ్వంతరావు, చిర్రరాజు, బి.సతీష్, ఫిరోజ్‌పాషా, ఉపేందర్, సాధు రాజేష్, మాదాసి కనకయ్య, బి.వెంకటగోపినాథ్, మామిడి లింగయ్య, సూర్యం, సదాశివ, రాజేశ్వరి, రంజిత్, మంథిని శంకరయ్య నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం

- బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో కలకలం
- అడ్డుకున్న స్థానికులు, సిబ్బంది


రాజేష్ ఓదార్చుతున్న బల్దియా సిబ్బంది, కార్మికులు

వరంగల్ అర్బన్: ఐదు నెలలుగా జీతం లేక తన కుటుంబ సభ్యులు పస్తులుంటున్నారని ఓ స్వచ్ఛ ఆటో డ్రైవర్ కమ్ ఓనర్ భావోద్వేగానికి గురై ఆత్మహత్యకు యత్నించాడు. వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను శరీరంపై పోసుకొని నిప్పంటించుకునేందుకు ప్రయత్నించాడు. విషయాన్ని గమనించిన బల్దియా సిబ్బంది, అధికారులు చేరుకొని వేతనం ఇప్పిస్తామని భరోసా కల్పించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. వరంగల్ గిర్మాజీపేటకు చెందిన రాజేష్ హనుమకొండ వడ్డేపల్లి 60 టీచర్స్ కాలనీలో ఇంటింటా తడి, పొడి చెత్త సేకరిస్తూ, సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలిస్తుంటాడు. ఐదు నెలలు దాటినా వేతనం రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, కుటుంబం గడవడం గగనంగా మారిందని తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం టీచర్స్ కాలనీ ఆటోలో చెత్త సేకరించిన రాజేష్ అదే వాహనంలో బల్దియా ప్రధాన కార్యాలయానికి చేరుకున్నాడు. తన వెంట తెచ్చుకున్న బాటిల్‌లోని పెట్రోల్‌ను శరీరంపై పోసుకున్నాడు. జీతం ఇవ్వకపోవడం వల్ల ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పడంతో గమనించిన స్థానికులు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు కమ్ ఓనర్లు, బల్దియా సిబ్బంది అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. సమాచారం మేరకు సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ అక్కడికి చేరుకొని రాజేష్‌ను బుజ్జగించి, వేతనాన్ని ఇప్పిస్తానని భరోసా కల్పించాడు. నెల వేతనం చెక్కు సిద్ధంగా ఉందని, మారో మూడు నెలల చెక్కు రెడీ అయిందని ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ అనిసుర్ ఉర్ రషీద్, సీఎంహెచ్ఓలు సముదాయించి, ఎలాంటి ఆందోళన అవసరం లేదని సర్దిచెప్పారు.

ఒప్పందం గడువు ముగిసింది

స్వచ్ఛ ఆటో డ్రైవర్ కమ్ ఓనర్ల ఐదేళ్ల ఒప్పందం గడువు ముగిసింది. ఇటీవల వీరి కొనసాగింపు విషయమై ప్రభుత్వానికి లేఖ రాశాం. నెల వేతనం చెక్కు సిద్ధంగా ఉంది. మారో మూడు నెలల చెక్కు ప్రాసెస్‌లో ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందగానే ఏ పద్ధతిలో వీరి సేవలను తీసుకోవాలనే విషయంపై మేయర్, కమిషనర్లు స్పష్టతనిస్తారు.

\- బల్దియా సీఎంహెచ్ రాజేష్

దామెరవాయి అడవుల్లో స్మారక శిలలు

- గుర్తించిన 'టార్చ్ టీం ఆఫ్ రీసెర్చ్' సంస్థ


స్మారక శిలల వద్ద హెరిటేజ్ సంస్థ యువకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధి దామెరవాయి అడవుల్లో పాతరాతి యుగం నాటి స్మారక శిలలను గుర్తించారు. దామెరవాయి గ్రామానికి చెందిన పునెం శ్రీధర్ సమాచారం మేరకు టార్చ్ టీం ఆఫ్ రీసెర్చ్ ఆన్ కల్చర్ హెరిటేజ్ సంస్థ సభ్యులు, స్థానిక యువకులు బి.కార్తీక్, కె.శ్రీకాంత్ గ్రామానికి ఉత్తరం దిక్కున మూడు కిలోమీటర్ల దూరంలోని కప్పలాయి సమీప అడవిలో పాతరాతి యుగం నాటి మూడు మానవ స్మారకశిలలను గుర్తించి పరిశోధన చేశారు. వివరాలు వారి మాటల్లోనే.. ఆదిమానవులు సమాధుల వద్ద నిలువురాళ్లు పాతే పద్ధతి పాటించేవారు. స్థానిక సమూహంలో ముఖ్యులుగా భావించేవారి సమాధుల వద్ద పాతే అలాంటి రాళ్లను మెన్హిర్లు, నిలువురాళ్లు అంటారు. తెలంగాణలో అలాంటి నిలువురాళ్లు చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ 'సజీవం'గా ఉన్నాయి. అయితే వాటికి మానవాకృతి అద్దిన మెన్హిర్లు మాత్రం చాలా అరుదు. ఆంత్రోపోమార్ఫిక్ ఫిగర్స్‌గా పేర్కొనే ఈ రాళ్లు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో పరిమితంగా కనిపిస్తాయి. ఆరడుగుల ఎత్తు నాలుగున్నర అడుగుల వెడల్పుతో ఉన్న అరుదైన స్మారక శిల గుండ్రని తల, దీర్ఘచతురస్రాకారపు ఛాతీభాగం, భుజాలు, కిందికి నడుము భాగం పోల్చుకునేలా చెక్కి ఉన్నాయి. ఖమ్మం జిల్లాలోని కాచనపల్లి, గలబ, గుండాల ప్రాంతాల్లో ఆ శిలలకు పురుష, మహిళ రూపాన్ని కూడా చెక్కిన దాఖలాలున్నాయి. గోదావరి నది పరీవాహక ప్రాంతాన వెలుగులోకి వచ్చిన ప్రాచీన మానవుని సమాధులు నాటి మానవుని ఉనికిని తెలియజేయడమే కాకుండా మన ప్రాంతంలోని మానవ జాతుల పరిణామ క్రమాన్ని వెల్లడిస్తున్నాయి. ఇదివరకే కొత్తూరు గ్రామ సమీపంలో ఈ ఆకారాన్ని గుర్తించారు. దామెరవాయి సూరుగుండయ్య గుట్టపై ఆదిమానవుల సమాధులు సుమారు 145 ఉన్నాయి. సమీప గ్రామం కొత్తూరు మొట్లగూడెంలోని ఆదిమానవుల సమాధులను గ్రామస్తులు ఇళ్ల నిర్మాణాల కోసం ధ్వంసం చేయడం బాధాకరం. మిగిలిన చారిత్రక ఆధారాలను, ఎంతో చరిత్ర కలిగిన ఈ స్మారక శిలలను పరిరక్షించాలని పురావస్తు శాఖ అధికారులకు, గ్రామస్తులకు టార్చ్ సంస్థ కార్యదర్శి, యువ చరిత్రకారుడు అరవింద్ ఆర్య కోరారు.

బాలుడి విక్రయంలో అంగన్‌వాడీ టీచర్!

కరీమాబాద్: వరంగల్‌లో జరిగిన నాలుగేళ్ల బాలుడి విక్రయం ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మద్యానికి బానిసైన కరీమాబాద్‌కు చెందిన షేక్ మసూద్‌ను ఎవరు ట్రాప్ చేశారు.. ముఠాలో ఎంత మంది ఉన్నారు.. అనే విషయంపై పోలీసులు కూపీ లాగుతున్నట్లు తెలుస్తుంది. మసూద్ భార్య కౌసర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న మట్టెవాడ పోలీసులు రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో ఉన్న బాలుడిని తల్లి చెంతకు చేర్చిన పోలీసులు మసూద్‌తోపాటు నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఘటనలో ఓ అంగన్‌వాడీ టీచర్‌తోపాటు మరో ఇద్దరు మహిళలు, ఓ సినిమా థియేటర్‌లో పనిచేసే వ్యక్తి కలిసి మసూద్‌ను ట్రాప్ చేసినట్లు పోలీసుల దృష్టికి వచ్చినట్లు సమాచారం. ఈక్రమంలోనే వీరితోపాటు ఇంకెవరైన బాలుడి విక్రయం వెనక ఉన్నారా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా బాలుడి విక్రయం వెనక ముఠా ఉంటుందని కుటుంబసభ్యులు ఆరోపించడం చర్చనీయాంశంగా మారింది. గతంలో కూడా మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే బాలుడి కిడ్నాప్ జరగడం.. ఇప్పుడు నాలుగేళ్ల బాలుడిని స్వయంగా కన్న తండ్రి రూ.2.5 లక్షలకు విక్రయించడం కలకలం రేపుతోంది.

న్యూశాయంపేటలో మొసలి కలకలం


మొసలిని పట్టుకునేందుకు యత్నిస్తున్న జూపార్క్, ఫారెస్ట్ సిబ్బంది

కాజీపేట అర్బన్ : గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్‌లోని న్యూశాయంపేట నుంచి పద్మాక్షిరోడ్డుకు అనుకుని ఉన్న నాలాలో మంగళవారం మొసలి కలకలం రేపింది. స్థానికులు, జూపార్క్ రెస్క్యూ టీం కథనం ప్రకారం.. కాకతీయ జూపార్క్‌లోని మొసలి న్యూశాయంపేటలోని నాలాలో ప్రత్యక్షమైంది. గమనించిన స్థానికులు ఉల్లిక్కిపడి జూపార్క్, అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. సుమారు మూడు గంటల పాటు రెస్క్యూ టీం రాజు, సంతోష్, స్వామి, సాంబరాజులు శ్రమించినా ఫలితం లేకపోయింది. జూపార్క్‌లోని నాలా గుండా న్యూశాయంపేట నాలలోకి ప్రవేశించిన మొసలి జనాలను గమనించి తప్పించుకుంది. కాగా, ప్రతి ఏడాది వానొస్తే మొసలొస్తది అనే చందంగా తమ ప్రాంతం మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఫారెస్ట్ అధికారులు మొసలి ఉంది జాగ్రత్త అంటు బోర్డును పెట్టి, ఈ ఏడాది మంగళవారం రోజున పట్టుకునేందుకు యత్నించి, చేతులు దులుపుకున్నారని, మొసలిని పట్టుకుని, జూపార్క్ నాలాను జనావాసాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

మూగజీవాల మృత్యుఘోష

గడ్డి, నీరు పెడితే ఒళ్లుహూనం చేసుకుని కష్టపడి రైతులకు సహకారం అందించే పలు మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. మంగళవారం ఉదయం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉరుములు మెరుపులతో కురిసిన వర్షంతోపాటు పలుచోట్ల పడిన పిడుగులతో దుక్కిటెద్దులు, పాడి ఆవులు, గేదెలు మృతిచెందగా.. మరికొన్ని చోట్ల ఈదురుగాలులతో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి జంతువులు ప్రాణాలు కోల్పోయాయి. దీంతో ఆయా జీవాల యజమానులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రూ.లక్షల్లో నష్టపోవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.

పిడుగు పాటుకు పాడి ఆవు..



లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలోని నాగారంలో మంగళవారం పిడుగుపాటుతో కొలుపుల ఉప్పలయ్యకు చెందిన పాడి ఆవు మృతి చెందింది. సుడితో ఉన్న ఆవు విలువ సుమారు రూ.75వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకొని పరిహారం చెల్లించాలని బాధితుడు వేడుకుంటున్నాడు. ఇదిలా ఉండగా.. పిడుగుపాటుతో గ్రామంలోని వీధిలైట్లు, పలువురి ఇళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువులు ధ్వంసమయ్యాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా మరో నాలుగు చోట్ల పిడుగులు పడ్డాయి.

రాములునాయక్‌తండాలో..



నర్సంపేట రూరల్ : పిడుగు పడి దుక్కిటెద్దు మృతిచెందిన ఘటన మండలంలోని రాములునాయక్‌తండాలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలంలోని రాములునాయక్‌తండా గ్రామ శివారులోని హేమ్లాతండాకు చెందిన గుగులోతు ఈరు ఇంటి వద్ద పిడుగు పాటుకు దుక్కిటెద్దు అక్కడికక్కడే మృతిచెందింది. దీని విలువ రూ.లక్ష ఉంటుందని బాధితుడు రోధిస్తూ తెలిపాడు.

అలింపూర్‌లో పాడి గేదె..



బచ్చన్నపేట: జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని అలింపూర్‌లో పాకాల శివకుమార్‌కు చెందిన పాడి గేదె మంగళవారం పిడుగు పాటుతో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. రోజూ మాదిరిగానే వ్యవసాయ బావి వద్ద గేదెను కట్టి ఉంచానని ఉదయం పిడుగులు పడడంతో గేదె మృతి చెంది ఉందని వాపోయాడు. రైతుకు రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ నరెడ్ల బాల్‌రెడ్డి, గ్రామస్తులు కోరారు.

విద్యుదాఘాతంతో గేదె, ఎద్దు



వర్ధన్నపేట: మంగళవారం ఉదయం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపడి మేతకు వెళ్లిన గేదె, దుక్కిటెద్దు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లిలో చోటుచేకుంది. బాధితుల కథనం ప్రకారం సంగెం మండలం లోహిత శివారు తండాకు చెందిన గుగులోతు యాకూబ్‌కు చెందిన దుక్కిటెద్దు, గుగులోతు శేఖర్‌కు చెందిన పాడి గేదె మేత కోసం మంగళవారం మధ్యాహ్నం ఉప్పరపల్లి శివారులో మేత మేస్తుండగా ఈదురు గాలులకు తెగి పడిన విద్యుత్ తీగలు తాకడంతో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. గేదె విలువ సుమారు రూ.80వేలు, దుక్కిటెద్దు విలువ రూ.90వేలు ఉంటుందని బాధితులు ఆవేదనతో తెలిపారు. తమకు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

కొంకపాకలో పాడి గేదెలు..



పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక గ్రామంలో విద్యుదాఘాతంతో వర్కాల ఎల్లస్వామికి చెందిన రెండు పాడిగేదెలు మృతి చెందాయి. వివరాలిలా ఉన్నాయి.. ఎల్లస్వామి రోజు మాదిరిగానే తన ఇంటి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గేదెలను కట్టేశాడు. మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్టు వైరు షార్ట్ సర్క్యూట్ కావడంతో గేదెలు మృతి చెందాయి. రెండు పాడి గేదెల మృతితో రూ.1.5లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు విలపించాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఎల్లస్వామి కోరాడు.


కరెంట్ షాక్‌తో గొర్రె..



రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని ఖిలాషాపూర్ 5వ వార్డులోని ఇనుప స్థంభానికి తాకి గొర్రె కరెంట్ షాక్‌తో మంగళవారం అక్కడికక్కడే మృతి చెందగా.. కాపరి తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి సురిగెల రవి ఉదయం వర్షం పడుతున్న సమయంలో పాకలోని గొర్రెలను బయటకు తోలుకెళ్తుండగా.. పక్కనే ఉన్న ఇనుప విద్యుత్ స్తంభానికి కరెంట్ సరఫరా అవుతుండటంతో గొర్రె తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మరణించింది. ఆందోళనకు గురైన కాపరి గొర్రెను లాగేందుకు యత్నించగా తనకు షాక్ కొట్టింది. స్థానికులు గుర్తించి కర్రలతో పక్కకు నెట్టడంతో ప్రాణాలతోబయట పడ్డాడు. ప్రమాదకరంగా ఉన్న ఇనుప స్తంభాలను తొలగించాలని విద్యుత్ అధికారులను పలు మార్లు కోరినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ ముప్పిడి శ్రీధర్‌తో పాటు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులు ఆందోళనకు సిద్ధం కాగా విద్యుత్ అధికారులు, సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మూడు ఇనుప స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ స్థంభాలను నాటారు.

ముల్కలగూడెంలో..

ఐనవోలు: పిడుగుపాటుకు గురై కాడెద్దు మృతిచెందిన సంఘటన మండలంలోని ముల్కలగూడెంలో చోటు చేసుకుంది. ఎండిగ కొమురయ్య తనకు చెందిన రెండు కాడెద్లను ఇంటి వెనుక దొడ్డిలో సోమవారం రాత్రి కట్టేసాడు. మంగళవారం ఉదయం వర్షం కారణంగా ఆలస్యంగా ఎడ్ల వద్దకు వెళ్లిన కొమురయ్యకు ఎడ్లు మృతిచెంది కనిపించడంతో కన్నీరు మున్నీరుగా విలపించాడు. పిడుగులతో కూడిన వర్షం కురువగా ఎడ్లు మృతిచెందాయని బాధితుడు వాపోయాడు. వీటి విలువ సుమారు రూ.1.2లక్షల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



దూదేకులపల్లిలో..




భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని దూదేకులపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి కురిసిన అకాల వర్షానికి విద్యుత్ వైరు తెగి కిందపడి ఉంది. ఈక్రమంలో మంగళవారం మేతకు వెళ్లిన నలవేని వీరయ్యకు చెందిన కాడెద్దుకు విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని వీరయ్య ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు.

కేవులా తండాలో..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని కేవులా తండా గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందింది. తండాకు చెందిన బాదావత్ పాండ్యా తన ఎద్దులను మేత కోసం పొలానికి తీసుకువెళ్లాడు. ఈక్రమంలో అప్పటికే పొలంలో పడి ఉన్న విద్యుత్ తీగలు తగడంతో విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతిచెందింది. రూ.70 వేలు నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.



24 గంటల విద్యుత్‌తో ప్రజలకు మేలు


సర్కిల్ కార్యాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


భూపాలపల్లి రూరల్: 24 గంటల విద్యుత్ సరఫరా కేసీఆర్ కళ అని, దీంతో ప్రజలకు ఎన్నో రకాలుగా మేలు కలుగుతోందని జెన్‌కో చైర్మన్ ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ జిల్లా కార్యాలయాన్ని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్ గోపాల్ రావు, కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డిలతో కలిసి ప్రభాకర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రావు విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది విద్యుత్ సరఫరాలో తీసుకోవాల్సిన అంశాలపై వివరించారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మల్హార్, డీఈ నాగరాజు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో పూజలు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు దంపతులు దర్శించుకున్నారు. మంగళవారం సాయంత్రం ఆలయానికి రాగా ఆలయ అర్చకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మండపంలో గణపతి పూజ నిర్వహించి, స్వామివారికి పూజలు చేశారు.శ్రీశుభానందదేవి అమ్మవారికి పూజలు చేశారు. ఆయనను ధర్మకర్తలు కామిడి రాంరెడ్డి, అడప సమ్మయ్యలు శాలువాతో సన్మానించారు. అర్చకులు తీర్థప్రసాదం అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు. వారి వెంట ఎంపీటీసీ మమత, సర్పంచ్ వసంత, ట్రాన్స్‌కో ఎస్ఈ మల్హార్, ఏడీ నాగరాజు, జెన్‌కో డీఈ చందన్‌సింగ్, ఏడీ శ్రీనివాస్, ట్రాన్స్‌కో సిబ్బంది కిరణ్‌కాంత్, సదానందం పాల్గొన్నారు.

ఓసీపీ సందర్శన

మల్హర్: జయశంకర్ భూపాలపల్లి మల్హర్ మండలం తాడిచర్ల ఏఎమ్మార్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓసీపీ(ఓపెన్‌కాస్ట్ మైన్స్)ని జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా 2022–23 ఆర్థిక సంవత్సరంలో 25 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని నిర్దేశించిన లక్ష్యాన్ని గడువు లోగా టార్గెట్‌ను పూర్తి చేసిన సందర్భంగా ఏఎమ్మార్ అధికారులను, కార్మికులను ప్రభాకర్‌రావు అభినందించారు. ఇదే స్ఫూర్తి కొనసాగించి, మున్ముందు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని వివరించారు. జాతీయ రక్షణ అవార్డు పొందిన సందర్భంగా అభినందించారు. అనంతరం మైన్ ఆవరణలో కొలువుదీరిన దేవతా ఆలయాలను సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. జెన్‌కో డైరెక్టర్‌లు టీఆర్‌కే రావు, లక్ష్మయ్య, బాలరాజు, సీఈ సిద్ధయ్య, జీఎం మోహన్‌రావు, నితీష్‌రెడ్డి, ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్‌లు విశ్వనాథ్‌రాజు, ప్రభాకర్‌రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రభాకర్‌రావు దంపతులను సన్మానిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలో సోమవారం ప్రారంభమైన బొడ్రాయి గ్రామదేవతల ప్రతిష్ఠాపన వేడుకగా కొనసాగుతోంది. భూలక్ష్మి, మహాలక్ష్మి, పోచమ్మ, పోతరాజు గ్రామ దేవతల ప్రతిష్ఠాపనలో భాగంగా బ్రాహ్మణులు, వేద పండితుల మంగళవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలిరోజు గడీ ముందు ఏర్పాటు చేసిన యజ్ఞ మండపంలో బ్రహ్మశ్రీ భానుమూర్తి, కృష్ణమూర్తి, ప్రవీణ్‌శర్మ నేతృత్వంలో 12 మంది బ్రాహ్మణుల బృందం గ్రామశుద్ధికి వేద ఉపనిషత్ పారాయణం, పుణ్యాహవచనం కార్యక్రమాలు నిర్వహించింది. మంగళవారం ఉదయం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్వస్తి పుణ్యాహవచనం, ఋత్విక్ వర్ణం, అంకురార్పణం, యాగశాల ప్రవేశం, మంటపారాధన, జలాదివాస హోమాలు, జలాదివాస కార్యక్రమాలు నిర్వహించారు.హీ సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం, కులసంఘాలు క్రతువులో భాగస్వాములైన బ్రాహ్మణులకు నూతన వస్త్రాలు బహూకరించాయి. కైలాస కళ్యాణి క్షేత్ర చైర్మన్ పీవీ.మనోహర్‌రావు–సరస్వతి దంపతులతోపాటు పీవీ.మదన్‌మోహన్‌రావు, రాజ్‌మోహన్, సర్పంచ్ రజిత, ఎంపీటీసీ కౌసల్య నవగ్రహారాధనలో పాల్గొన్నారు. గ్రామంలో పండుగ వాతావర్ణం నెలకొంది.

జూన్ 3న రైతు దినోత్సవం



శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలోని రైతు వేదికలో జూన్ 3న రైతు దినోత్సవం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి తెలిపారు. ఆ రైతు వేదికను మంగళవారం ఆయన సందర్శించి పరిశీలించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం షెడ్యూల్‌లో పేర్కొనడంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కిరణ్, ఫీల్డ్ అసిస్టెంట్ కుమారస్వామి ఉన్నారు.

ఇద్దరు విద్యార్థులకు గురుకులాల్లో ప్రవేశం




ఐనవోలు : మండలంలోని ఉడుతగూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ఇద్దరు విద్యార్థులకు ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ప్రవేశం లభించింది. ఇటీవల 5వ తరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వం పరీక్ష నిర్వహించగా తాటికాయల ఝాన్సీ, బరిగల నాన్సీ సీట్లు సాధించారని హెచ్‌ఎం చుంచు కాల లింగారావు తెలిపారు. ఝాన్సీ పర్వతగిరిలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ సొసైటీ స్కూల్‌లో, నాన్సీ మడికొండలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో సీట్లు సాధించినట్లు ఆయన చెప్పారు. ఇద్దరు విద్యార్థులను సర్పంచ్ బరిగల ఆరోగ్యం, ఉపాధ్యాయురాలు ఉమాదేవి, ఎస్‌ఎంసీ చైర్మన్ తాటికాయల శ్రీను, వార్డు సభ్యురాలు మమత అభినందించారు.

రక్తదానశిబిరం

హసన్‌పర్తి : మండలంలోని భీమారంలో ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక రోమన్ క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ సీహెసీ, పరకాల బ్లడ్ బ్యాంక్ సహకారంతో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రైతు బంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు సంగాల విక్టర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ్‌కుమార్, చర్చి ప్రెసిడెంట్ సంగాల ప్రేమ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ రమేష్, సెక్రటరీ పరమేష్, స్థానికులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం కమిటీ ఎన్నిక

హన్మకొండ: మున్నూరు కాపు సంఘం 51వ డివిజన్ కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొత్త దశరథం తెలిపారు. మంగళవారం హనుమకొండ హౌజింగ్ బోర్డు కాలనీలో డివిజన్ మున్నూరు కాపు సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షురాలిగా గంగుల వినోద, ఉపాధ్యక్షులుగా జిలకల దుర్గారావు పటేల్, రాకం ప్రవీణ్ పటేల్, కారంగుల వాణి, ప్రధాన కార్యదర్శిగా నిమ్మకాయల వెంకట్ పటేల్, సహాయ కార్యదర్శులుగా అడప రాజు పటేల్, కొప్పుల సతీష్ పటేల్, కోశాధికారిగా పత్రి శ్రీకాంత్ పటేల్ ఎన్నికయ్యారని వివరించారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారని చెప్పారు.

అకాల వర్షం.. అపార నష్టం..

తడిసిన ధాన్యం, మక్కలు
- కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన బస్తాలు
- ఎగుమతిలో అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం



శాయంపేట : మైలారంలో నీటిలో తడిచిన ధాన్యాన్ని ఎత్తిపోస్తున్న రైతులు



ఆత్మకూరు : ధాన్యం తడవకుండా పరదాలు కప్పుతున్న రైతులు



ఐనవోలు : ధాన్యం రాశుల్లోకి చేరిన నీరు

శాయంపేట : మంగళవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి రైతులకు అపార నష్టం వాటిల్లింది. పలు గ్రామాల్లో వరి ధాన్యం, మక్కలు తడిచిన దుస్థితి నెలకొంది. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన వరి ధాన్యం, మక్కలు అమ్మేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగా గన్నీ సంచుల కొరతతోపాటు రవాణా సమస్యతో వరి ధాన్యం, మక్కలు పేరుకుపోయాయి. మండలంలో 13 వరి ధాన్యం, మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తమకు ఇష్టమొచ్చిన వారికి గన్నీ సంచులు ఇచ్చారన్న అపవాదు ఉంది. కొందరు రైతులకు గన్నీ సంచులు అందజేసినా రవాణా సమస్య వల్ల కొనుగోలు కేంద్రాల్లో వేల సంఖ్యలో ధాన్యం బస్తాలు పేరుకుపోయాయి. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం వీచిన గాలి దుమారం, భారీ వర్షానికి ధాన్యం తడిసి దెబ్బతిన్నది. రైతులు గత్యంతరం లేక ధాన్యం సంచుల చుట్టూ నీరు జాలువారకుండా మట్టితో కట్టలు కట్టి నీటిని ఎత్తిపోయాల్సిన దుస్థితి నెలకొంది. రవాణా సమస్య ఏర్పడుతుందని ఇటీవల ప్రగతి సింగారంలో రైతులు కొనుగోలు కేంద్రంలోని వరి ధాన్యానికి నిప్పు పెట్టి నిరసన తెలిపినా ప్రభుత్వంలో, అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం. వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు కుదేలవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

ఆత్మకూరు : మండలంలో కురిసిన భారీ వర్షానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధాన్యం, మక్కజొన్న పంట తడవడంతో వేదనకు గురయ్యారు. కొందరు రైతులు పంట తడవకుండా పరదాలు కప్పుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సంచులు పంపిణీ చేయడంతో రైతులు వాటిలో ధాన్యాన్ని నింపుకున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఐనవోలు : అకాల వర్షానికి మండల రైతులు ఇబ్బందులు పడ్డారు. పంథిని కొనుగోలు కేంద్రంలో సుమారు 600 బస్తాల మక్కలు కాంటా అయినా లారీలు రాకపోవడంతో ఎగుమతి కాకపోవడంతో వర్షానికి తడిచిన దుస్థితి నెలకొంది. కాంటా అయిన బస్తాలను మళ్లీ వేరే బస్తాల్లో నింపితేనే లారీలో పంపిస్తామంటూ నిర్వాహకులు రైతులను వేదనకు గురి చేశారు. రైతులకు గత్యంతరం లేక మళ్లీ వేరే బస్తాల్లో నింపిన పరిస్థితి చోటు చేసుకుంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడం కష్టంగా మారిందని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేశారు. పలు చోట్ల ధాన్యం రాశులు తడవగా రైతులు ధాన్యాన్ని ఆరబోసుకున్నారు.

అన్నదాత ఆగం

- రైతుల ఆందోళన, బీజేపీ ధర్నా

పరకాల : మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి మండల రైతులు ఆగమయ్యారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన ధాన్యం, మక్కజొన్నలు తడిచిన దుస్థితి చోటు చేసుకుంది. పీఏసీఎస్, మార్కెట్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ధాన్యం కాంటా కాక ఇప్పటికి రెండుసార్లు వర్షానికి తడిచిందంటూ మార్కెట్ ఎదుట పరకాల–హనుమకొండ ప్రధాన రహదారిపై రైతులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. రైతుల ఆందోళనకు మద్దతుగా బీజేపీ నాయకులు ధర్నా చేపట్టడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వ, అధికారుల నిర్లక్ష్య వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. పోలీసులు నచ్చజెప్పేందుకు యత్నించినా రైతులు, బీజేపీ నాయకులు ఆందోళన కొనసాగించారు. తడిచిన ధాన్యాన్ని, మక్కజొన్నలను కాంటా చేస్తేనే కదులుతామని భీష్మించారు. తడిచిన ధాన్యాన్ని కొంటామని ఓవైపు ప్రభుత్వం ప్రకటిస్తున్నా మరోవైపు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు అనేక కొర్రీలతో రైతులు ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని బీజేపీ నాయకులు విమర్శించారు. రైతులకు న్యాయం చేస్తామంటూ సీఐ కిషన్ హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, దేవునూరి మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంత్‌లాల్, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, నాయకులు నిరంజన్, తిరుపతి, నారాయణదాసు పాల్గొన్నారు.

హామీల అమలులో పాలకుల నిర్లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని చింతలపల్లి గ్రామంలో 'పల్లె పల్లెకు ప్రవీణన్న.. గడపగడపకు కాంగ్రెస్..' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలపై అధ్యయనం చేశారు. అనంతరం ప్రవీణ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే నల్లధనాన్ని తీసుకొస్తామని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, తదితర హామీలను బీజేపీ గుప్పించిందని తెలిపారు. బీఆర్‌ఎస్ పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇంటికో ఉద్యోగం, తదితర హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అనేక హామీలు గుప్పించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి తదనంతరం ప్రజలను విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నాయని మండిపడ్డారు. గ్యాస్, ఇతర నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటగా, పల్లెల్లో మద్యం ఏరులై పారుతోందని చెప్పారు. ఉద్యోగాల్లేక యువత వేదనకు గురౌతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ పాలనలో గత రెండేళ్లుగా గ్రామ పంచాయతీ బిల్లులు విడుదల కాక సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడుతున్న దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో మతోన్మాదం పెరిగిపోతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రజాధనాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెడుతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2 రుణమాఫీ, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుకినె సంతాజీ, నాయకులు రాఘవులు, ఎంపీటీసీ ఇంద్రసేనారెడ్డి, చల్లా రవీందర్‌రెడ్డి, అడ్డూరి రమేష్, హింగె శ్రీకాంత్, చల్లా మల్లారెడ్డి, ఐలయ్య, భాస్కర్, సంపత్, బత్తిని రవీందర్, ఎర్రోళ్ల జగన్, హింగె రాజేశ్వర్‌రావు, మండ సుమన్, చైతన్య, కొమురయ్య, గోపాల్, చందర్‌రావు, భిక్షపతి, కిషన్‌రావు, ప్రమోద్, బాలు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణరావు



పరకాల : నిరసన తెలుపుతున్న నాయకులు

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి బాధిత రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి తడిచిన ధాన్యాన్ని, పేరుకుపోయిన బస్తాలను పరిశీలించారు. అనంతరం సత్యనారాయణరావు మాట్లాడారు. మంగళవారం తెలవారుజామున ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో నియోజకవర్గంలోని అన్ని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మొత్తం తడిచిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు , సివిల్ సప్లై డీఎం, డీసీఓలు కుమ్మక్కై రైతులను నిలువునా దోచుకుంటున్నారని విమర్శించారు. పీఏసీఎస్ సెంటర్లలో ధాన్యాన్ని తూకం వేసేటప్పుడు అదనంగా 5 కిలోల వరకు తీసుకుంటున్నారని తెలిపారు. వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చిందం రవి, కట్టయ్య, మార్కండేయ, తదితరులు పాల్గొన్నారు.

పరకాల : అకాల వర్షంతో తడిచిన మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షానికి ధాన్యం తడిచి నష్టపోయిన రైతులను ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. తడిచిన ధాన్యం కుప్పల వద్ద ప్రభుత్వ వైఖరి నశించాలని నినాదాలు చేశారు. అనంతరం దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ మాట్లాడారు. తడిచిన ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేస్తామని ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించినా కొనుగోలు కేంద్రాల వద్ద కాంటాలు కూడా వేయని దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నడికూడ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి పబ్బ శ్రీనివాస్, వర్కింగ్ అధ్యక్షుడు మహ్మద్ అలీ, ఒంటేరు శ్రావణ్ పాల్గొన్నారు.

ఉత్సవాలను పండుగలా నిర్వహించండి



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ సుధీర్



దామెర : మాట్లాడుతున్న ఎంపీపీ శంకర్

- జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్

ఎల్కతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దశాబ్ది ఉత్సవాలను పండగలా నిర్వహించాలని జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ కోరారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం 21 రోజులపాటు ఉత్సవాలను నిర్వహించడానికి నిర్ణయించిందని చెప్పారు. ఉత్సవాలను మండలవ్యాప్తంగా నిర్వహించాలని తెలిపారు. ఉత్సవాల్లో అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ జక్కుల అనిత, ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ హరికృష్ణ, ఎస్సై మహేందర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దామెర : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంపీపీ కాగితాల శంకర్, జెడ్పీటీసీ గరిగె కల్పన కృష్ణమూర్తి మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రజలను భాగస్వాములను చేయాలని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ ఎండీ.రియాజుద్దీన్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ నాగరాజు, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఖిలా వరంగల్ : కూలర్‌లో నీళ్లు పోస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురైన 84 ఏళ్ల వృద్ధుడు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు నర్మెట్ట స్వామి కథనం ప్రకారం.. వరంగల్ 17వ డివిజన్ పరిధిలోని నర్సంపేట రోడ్డులోని జాన్‌పీరీలు ప్రాంతానికి చెందిన నర్మెట స్వామి ఇంట్లో అతడి తండ్రి కట్టయ్య (84) నివాసం ఉంటున్నాడు. ఈనెల 26న రాత్రి కట్టయ్య తన గదిలోని కూలర్‌లో నీళ్లు పోస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన కొడుకు వెంటనే నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మంగళవారం మృతుడి కొడుకు స్వామి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్‌గా శ్రీనివాస్

వరంగల్ : వరంగల్ మండల రైతు బంధు సమితి కోఆర్డినేటర్‌గా బుద్దె శ్రీనివాస్‌ను నియమిస్తూ వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం హనుమకొండలో బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ నియామక పత్రాన్ని శ్రీనివాస్‌కు అందజేసి అభినందించారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యేకు, డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు, జిల్లా రైతు బంధు సమన్వయకర్త లలితాయాదవ్, కార్పొరేటర్లు షీబారాణి, సులోచన, అనిల్‌కుమార్, సారయ్యలకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతోనే పౌరహక్కుల పరిరక్షణ



మాట్లాడుతున్న తహసీల్దార్ సమ్మయ్య

ధర్మసాగర్ (వేలేరు) : విద్యను అభ్యసించడం ద్వారానే పౌరహక్కుల పరిరక్షణ సాధ్యమని తహసీల్దార్ దేవులపల్లి సమ్మయ్య స్పష్టం చేశారు. మండలంలోని బండతండా, చింతల్‌తండా, గొల్లకిష్టంపల్లి, తదితర గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరు స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, బాధ్యతగా జీవించాలని ఆకాంక్షించారు. రాజ్యాంగ బద్ధంగా లభించిన హక్కులను వినియోగించుకునేలా ప్రజలు రాజ్యాంగంపై సంపూర్ణ అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. స్వపరిపాలనలో భాగంగానే తండాలు గ్రామ పంచాయతీలు అయ్యాయని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికా సంఘం నుంచి నిధులు కేటాయిస్తాయని చెప్పారు. సదరు నిధులు పౌరహక్కుల పరిరక్షణకు ఉపయోగ పడతాయని వివరించారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా చూడాలని ప్రజలను కోరారు. చదువుకుంటేనే హక్కులను సాధించుకోగలరని ఆయన తేటతెల్లం చేశారు. అనంతరం ప్రజలతో పౌరహక్కుల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు మాలోతు సంపత్, మాలోతు రాంచందర్, సందెల పరమేశ్వరి, ఆర్‌ఐ సమ్మయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారులు లేక ఇబ్బందులు

వరంగల్ : నగరంలోని 14వ డివిజన్ మధురానగర్‌లో అంతర్గత రహదారులు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కాలనీలోని అంతర్గత రహదారులు బురదమయం కావడంతో ఎమ్మెల్యే అరూరి రమేష్, కార్పొరేటర్ తూర్పాటి సులోచన, మున్సిపల్ అధికారులు స్పందించి సీసీ రోడ్లుగా నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని అభివృద్ధి కమిటీ నాయకులు క్యాతం రవీందర్, ఎల్లయ్య కోరారు.

పేదలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

ఐనవోలు : బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటోందని ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ తెలిపారు. మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన కట్కూరి మాణిక్యం అనారోగ్యంతో బాధపడుతుండగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.50 లక్షల విలువైన లెటర్ ఆఫ్ కాన్సెంట్ (ఎల్‌ఓసీ)ని ఆయన కుటుంబానికి హనుమకొండలోని తన నివాసంలో ఎమ్మెల్యే రమేశ్ మంగళవారం అందజేసి మాట్లాడారు. ఆరోగ్యశ్రీలో అందని వైద్యం కోసం ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం పొందితే పేదలకు ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ నుంచి సాయం అందిస్తుందని తెలిపారు. పేదలు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సాంకేతిక నిర్వహణా సంస్థ (ఆత్మ) జిల్లా డైరెక్టర్ కట్కూరి రాజు, నాయకులు బెన్‌సన్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసుల ఫిర్యాదు మేరకు చర్యలు

- మేయర్ గుండు సుధారాణి

కాశిబుగ్గ: నగరంలోని 19వ డివిజన్ పరిధిలోని వివేకానందకాలనీలో కలుషితమైన నీరు వస్తుందన్న స్థానికుల ఫిర్యాదు మేరకు చర్యలు చేపడతామని మేయర్ గుండు సుధారాణి తెలిపారు. మంగళవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో ఆమె పర్యటించి నీటి సరఫరాను పరిశీలించారు. నీటిని తాగి పరిశుభ్రమైన నీరు వస్తుందని నిర్ధారించారు. కాలనీవాసుల ఫిర్యాదుతో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ కాలనీలో నివసిస్తున్న వారి ఇళ్లలోకి వెళ్లి మహిళలను కలిసి నీటి సరఫరా జరుగుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాశీబుగ్గలోని ఏకలవ్య ఉద్యానవనంలోని ఓపెన్ జిమ్ వద్ద సాధన చేస్తున్న మహిళలతో ముచ్చటించారు. పార్క్‌లో ఫ్లోరింగ్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) శ్రీనివాస్‌ను ఆదేశించారు. తదనంతరం మిషన్ భగీరథ ఈఎస్‌ఎల్‌ఆర్‌ను మేయర్ సుధారాణి పరిశీలించారు. ఆమె వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) రవికిరణ్, ఏఈ సౌజన్య, బీఆర్‌ఎస్ నాయకుడు ఓని భాస్కర్ తదితరులున్నారు.

ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలి



శాయంపేట : కరపత్రాలను విడుదల చేస్తున్న సదానందం, నాయకులు



దామెరలో..

శాయంపేట : కొత్తగూడెంలో జూన్ 4న తలపెట్టిన ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ మండల నాయకుడు బత్తిని సదానందం కోరారు. మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 633లోని గుడిసెల వద్ద ప్రజాగర్జన కార్యక్రమ కరపత్రాన్ని మంగళవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కొత్త మైన్ల ఏర్పాటు, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, గుడిసెవాసులకు పట్టాలు, తదితర ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగుతాయని చెప్పారు. పాలకులు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై అవగాహన కల్పించేలా సభను నిర్వహించనున్నట్టు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. పాలకులు అవలంభిస్తున్న తప్పుడు విధానాలపై ప్రజలు అవగాహన పెంచుకుని చైతన్యవంతులై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటాలే శరణ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు అనుకారి అశోక్, అరికిల్ల దేవయ్య, మారెపల్లి క్రాంతికుమార్, రమాదేవి, రాజమణి పాల్గొన్నారు.

దామెర : మండల కేంద్రంలో ప్రజాగర్జన సభ కరపత్రాన్ని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొట్టెపాక రవి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యలు, పరిష్కారం కోసం ప్రజాగర్జన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అంబి సాంబయ్య, దండు భాస్కర్, రాజేష్, శివకుమార్, వేల్పుల అఖిల, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాల కేసు.. పోలీసుల అదుపులో ఇద్దరు..!

వరంగల్: వరంగల్ నగరంలోని 14వ డివిజన్ పరిధిలోని మణికంఠ కాలనీలోని ప్లాట్లను ఆక్రమణకు పాల్పడ్డారన్న కేసులో ఇద్దరిని ఏనుమాముల పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. బాధితుల కథనం ప్రకారం.. మణికంఠ కాలనీ రోడ్డు నెంబర్ 4లోని తమ ప్లాట్లను అక్కడి స్థానికంగా నివాసం ఉంటున్న కేదాసి మోహన్, ఎల్‌ఐసీ వెంకటేష్ తమ ప్లాట్లను కబ్జా చేశారంటూ బాధితులు ఎలకంటి నాగరాజు, చింతల శ్రీను, గట్ల జగన్మోహన్, శ్రీరాముల మంజుల గతంలో వరంగల్ పోలీసు కమిషనర్ (సీపీ)కి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు అప్పటి ఏసీపీ గిరికుమార్ విచారణ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. కేసును ఏసీపీ ఇంతేజార్‌గంజ్ పోలీసులకు విచారణ నిమిత్తం అప్పగించారు. ఈ కేసుపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో తాజాగా బాధితులు ప్రస్తుత సీపీ రంగనాథ్‌ను కలిసి మరోమారు ఫిర్యాదు చేశారు. ఈ కేసును ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధి నుంచి ఏనుమాముల పోలీసులకు అప్పగించడంతో సీఐ మహేందర్, ఎస్సై శ్రీకాంత్‌లు మంగళవారం ఈప్లాట్ల కబ్జా వ్యవహారంపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బాధితులు ఫిర్యాదు మేరకు కబ్జా చేసినట్లు ఆరోపిస్తున్న వ్యక్తిని ఏనుమాముల పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా బాధితుల ఫిర్యాదు మేరకు సీపీ ఆదేశాలతో క్షేత్ర స్థాయిలో ప్లాట్లకు సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్నామని తెలిపారు.